క్లుప్తంగా

గైట్‌ను సందర్శించిన అధికారులు



ఐఆర్ఎస్ అధికారులను సత్కరిస్తున్న చైతన్యరాజు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబెల్ యూనివర్సిటీ (జీజీయూ)ని ముంబయికి చెందిన ఆదాయ పన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ హర్షద్, కస్టమ్స్, జీఎస్టీ అదనపు కమిషనర్ అనుశ్రీలు బుధవారం సందర్శించారు. ఇక్కడకు వచ్చిన వారు యూనివర్సిటీ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు)తో కొద్దిసేపు సమావేశమై, యూనివర్సిటీకి సంబంధించిన పలు విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరినీ దుశ్శాలువాలతో సత్కరించారు.

రోడ్డు నిర్మించాలని వినతి

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం గణేష్‌నగర్‌కు రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట నాయుడు ఆధ్వర్యంలో ప్రజలు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. కోరుకొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలసి ఈ వినతి అందించారు. గణేష్‌నగర్‌లో రోడ్డు, కాలువలు నిర్మించాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. ఇక్కడ వంద కుటుంబాలు ఉన్నా కనీస సదుపాయాలు లేవన్నారు. త్వరితగతిని సమస్యలు పరిష్కరించాలని వారన్నారు. కార్యక్రమంలో సోడసాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం లోడుతో ఉన్న లారీ వద్ద డిప్యూటీ తహసీల్దార్ బాపిరాజు

రాజమహేంద్రవరం రూరల్: గొల్లప్రోలు నుంచి కడియం గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రాజానగరం డిప్యూటీ తహసీల్దార్ (సివిల్ సప్లయిస్) గొలుగూరి బాపిరాజు, సిబ్బందితో కలసి పట్టుకున్నారు. డీటీ బాపిరాజుకు అందిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో వీఆర్వోలతో కలసి హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ఉన్నారు. సుమారు రెండు గంటల సమయంలో మినీ లారీని ఆపి తనిఖీలు నిర్వహించగా, 176 బస్తాల్లో 7,630 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. గొల్లప్రోలుకు చెందిన మినీ లారీ డ్రైవర్ గట్టెం రవికుమార్, డ్రైవర్‌కు సాయంగా వచ్చిన గొల్లప్రోలుకు చెందిన కొత్త శ్రీనులను విచారించారు. ఈ విచారణలో బియ్యానికి సంబంధించి ఎటువంటి కాగితాలు లేవని, తనకు డ్రైవింగ్ లైసెన్సు లేదని డ్రైవర్ రవికుమార్ తెలిపాడు. రాజానగరం వద్ద లారీని యజమాని అల్లమల్లు రాంబాబు తనకు ఇచ్చి కడియం వెళ్లి అతనికి ఫోన్ చెయ్యమన్నాడని డిప్యూటీ తహసీల్దార్ బాపిరాజుకు వివరించాడు. లోడుతో ఉన్న లారీని రాజానగరంలోని విష్ణుగురుదత్త రైసుమిల్లుకు తరలించామని, దీని విలువ రూ.3,47,165 ఉంటుందని డీటీ తెలిపారు. రాంబాబు, గట్టెం రవికుమార్, కొత్త శ్రీనులపై బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై బి.శ్రీను కేసు నమోదు చేశారు.

పుష్కర నీరు మెట్టక్కలేదు

- ఖరీఫ్ సాగుకు మెట్ట రైతుల కష్టాలు
- సబ్ కెనాల్‌లో వర్షపు నీరే ఆధారం
- ఇంజిన్లతో తోడుతూ పాట్లు



జగన్నాథపురంలో పుష్కర సబ్ కెనాల్‌లోని వర్షపు నీటిని ఇంజిన్‌తో తోడతూ..



వర్షపు నీటితో నిండిన మధురపూడి- జగన్నాథపురం సబ్ కెనాల్

మధురపూడి: మెట్ట సాగుకు ఆధారం పుష్కర ఎత్తిపోతల పథకం.. దీనిని గోదావరి నదిపై పురుషోత్తపట్నం వద్ద నిర్మించారు. ఈ పథకం నుంచి నీరు విడుదల చేసినా మెట్ట పొలాలకు పూర్తి స్థాయిలో అందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రాజానగరం నియోజకవర్గంలో ఖరీఫ్ సాగుకు అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ, ఈ ప్రాజెక్టు నుంచి సాగునీరు అందక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బోర్ల సదుపాయం ఉన్న రైతులు ముందడుగు వేస్తుండగా, వరుణ దేవుడిని నమ్ముకున్న పుడమిపుత్రులు ఏం చేయాలో పాలుపోక ఎత్తిపోతల పథకం నీటి కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు నారుమడులు వేసినా నీటి సమస్యతో నారు ఎదగలేదు. ఈ నెల 3న పురుషోత్తపట్నం పుష్కర ఎత్తిపోతల పథకం రెండు పంపుల ద్వారా నీటిని విడుదల చేశారు. అయినా రాజానగరం, కోరుకొండ మండలాల్లోని 35 గ్రామాలకు సాగు నీరందక వరి నాట్లు పడలేదు. కొన్నిచోట్ల నారుమడుల దశలోనే ఉన్నాయి.

ఏ మండలంలో ఎంతెంత..

నియోజకవర్గంలో వేలాది ఎకరాల పంట భూమి ఉన్నా నామమాత్రంగానే సాగు జరుగుతోంది. కోరుకొండ మండలంలో 14,780 ఎకరాలు ఉండగా 737 ఎకరాలు, సీతానగరం మండలంలో 14,160 ఎకరాలకు 708, రాజానగరం మండలంలో 14,663కు 915 ఎకరాల్లో మాత్రమే నారుమడులు పడ్డాయి. పీఎల్ఏ 1100, ఆర్పీ బయో 226, ఎంటీయూ 1318, ఎంటీయూ 1064, స్వర్ణ, బీపీటీ 5201 తదితర రకాలను పండించేందుకు నారుమడులు వేశారు. వీటికి నీటి కొరత కారణంగా ఆకు ఆలస్యంగా ఎదిగింది. మొత్తానికి నియోజకవర్గంలోని మందకొడిగానే సాగు జరుగుతోంది.

లోపం ఎక్కడంటే..

సీతానగరం మండలం పురుషోత్తపట్నంలోని పుష్కర ఎత్తిపోతల పథకంలో 11 పంపులు ఉంటాయి. ఇక్కడి నుంచి నీరు పైప్‌లైన్ ద్వారా దేవీపట్నం మండలం గండికోటలోని కాలువలోకి విడుదలవుతోంది. దీని ప్రధాన కాలువపై ఉన్న 11 సబ్ లిఫ్టుల ద్వారా రాజానగరం నియోజకవర్గానికి నీరు వస్తుంది. వీటి నిర్వహణ లోపభూయిష్టంగా ఉండడంతో నీరు ఆలస్యంగా చేరుతోంది. కాగా ప్రతి ఏడాది 3 పంపులను నీటి విడుదలకు ఉపయోగిస్తారు. ఈ నెలలో 2 పంపుల ద్వారా మాత్రమే నీటిని విడుదల చేశారు. మెట్ట ప్రాంతాలకు నీరు ఆలస్యంగా చేరుతుండడంతో పాటు నీటి కొరత ఏర్పడింది. ప్రస్తుతం సబ్ కెనాల్‌లోని వర్షపు నీటినే తోడుకుని కొందరు రైతులు సాగుకు ముందుకు వెళ్తున్నారు.

పూర్తి స్థాయిలో నీరందక..



పుష్కరే ఖరీఫ్‌కు ఆధారం. నీరు విడుదల చేసినా పూర్తి స్థాయిలో అందడం లేదు. నారుమడుల్లో నారు ఎదుగుదలకు వర్షపు నీటిపై ఆధారపడాల్సి వస్తుంది. మండలంలోని రైతులు ఇంజిన్ల ద్వారా సబ్ కెనాల్‌లోని నీటినీ తోడుకోవాల్సి వస్తుంది. దీనికి అదనపు ఖర్చు అవుతోంది.

– నక్కా రాంబాబు, సర్పంచ్, జగన్నాథపురం

పెట్టుబడి పెరుగుతోంది



పుష్కర కాలువ నుంచి పూర్తిస్థాయిలో నీరు చేరకపోవడంతో సబ్ కెనాల్‌లోని వర్షపునీటిని ఇంజిన్‌తో తోడుతున్నాం. పొలంలో నారుమడులకు ఇలా నీటిని వాడుకుంటున్నాం. ఇంజిన్ అద్దెకు రూ.1,500 ఖర్చు అవుతోంది. ఇలా రెండు గంటలకు ఒక లీటరు ఆయిల్ వాడాల్సి ఉంది. ఇలా సాగులో పెట్టుబడి పెరుగుతోంది.

– బాలిన వెంకటేశ్వరరావు, రైతు, గుమ్ములూరు

చెక్ డ్యామ్ నిర్మించాలి



బురద కాలువపై శ్రీరంగపట్నం సమీపంలో 21వ నంబర్ వద్ద చెక్‌డ్యామ్ నిర్మించాలి. ఇది నిర్మించకపోవడంతో కోరుకొండ, గోకవరం మండలాల్లోని శ్రీరంగపట్నం, కోరుకొండ, జంభూపట్నం, గోకవరం మండలం అచ్యుతాపురం తదితర గ్రామాలకు 500 ఎకరాలకు నీరు అందడం లేదు.

– తనకాల ప్రసాద్, శ్రీరంగపట్నం, రైతు

ఘనంగా సత్తి వీర్రెడ్డి జయంతి



రామవరంలో సత్తి వీర్రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

పెదపూడి: అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు సత్తి వీర్రెడ్డి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్, రామవరం ఉప సర్పంచ్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయానికి నిలువెత్తు నిదర్శనం సత్తి వీర్రెడ్డి అన్నారు. పాలమూరు నీటి వినియోగదారుల సంఘం పరిధిలో రైతుల సంక్షేమం కోసం ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో విశాఖపట్టణం గౌతమి సంస్థ అధినేత సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, కాకినాడ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ సత్తి రామారెడ్డి, అనపర్తి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఆడాది చిన సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు గొలుగూరి గౌతమి, వీర్రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

సీతానగరం: చినకొండేపూడికి చెందిన ఒరిగేటి రమేష్ ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ మరణించగా, బాధిత కుటుంబానికి సీపీఐ (ఎమ్ఎల్) రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం చేశారు. ఆయన వెంట నాయకులు పలివెల జ్యోతి, సిద్దే నాగరాజు, నందమూరి చిట్టిస్వామి, సిద్దే రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నేత్రపర్వం.. పాండురంగని కల్యాణం



సామర్లకోటలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామి కల్యాణం

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన పండితులు
- కల్యాణ వేడుకను తిలకించిన భక్తులు

సామర్లకోట: రుక్మిణీ సమేత పాండురంగ స్వామి కల్యాణం బుధవారం నేత్ర పర్వంగా జరిగింది. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పాండురంగ స్వామి ఆలయంలో ప్రతి ఏడాది ఆషాడ మాసం తొలి ఏకాదశి పర్వదినంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. తొలి ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకోవడం ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. ఈ మేరకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు అయోధ్యుల పద్మ రాజేంద్రకుమార్, రాజేష్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. నూతనంగా వివాహం అయిన దంపతులు స్వామివారిని దర్శించుకోవడం ద్వారా సంతానం కలుగుతుందనే నమ్మకం. ఈ మేరకు ఇటీవల వివాహం అయిన దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 190 ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం కావడంతో ఒక వైపు మార్గం మాత్రమే ఏర్పాటు చేశారు. దాంతో వీఐపీలు కూడా క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకోవాల్సి వస్తోంది. ఆలయం నుంచి కిలో మీటరు పొడవున భక్తులు బారులుతీరారు. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అయోధ్యుల రాజేష్, కృష్ణవేణి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. పంచారామ క్షేత్ర అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చంటి వేద మంత్రాల మధ్య కల్యాణం పూర్తి చేశారు. రుక్మిణి సమేత పాండు రంగ స్వామి కల్యాణం తిలకించడం వలన పాపాల తొలగి పొయి సుఖసంతోషాలతో ఉంటారని వేమూరి సోమేశ్వరశర్మ భక్తులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను వివరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో పానకం, చక్రపొంగలి, పులిహోర ప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



జి.మామిడాడలో సూర్యనారాయణమూర్తి, దేవేరులు



పందలపాకలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు



అనపర్తిలో జనార్దన స్వామివారు

పెదపూడి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం ఆలయాలు భక్తులతో కిటకిటాలాడాయి. జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన సూర్యదేవాలయం, కోదండ రామాలయం, సంపర గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి, పుట్టకొండ గ్రామంలో ప్రాచీన చరిత్ర గల లక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పుట్టకొండలో ఆలయ ఈవో వద్దాది సత్యనారాయణ భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కన్నుల పండువగా తొలి ఏకాదశి

బిక్కవోలు: మండలంలోని ఆషాడ శుద్ధ ఏకాదశి(తొలి ఏకాదశి) పర్వదిన వేడుకలు బుధవారం కన్నుల పండువగా సాగాయి. బిక్కవోలు లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అలాగే పందలపాక వెలమపేట రామాలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భజనలు చేశారు.

పెదపూడి: అనపర్తి మండలంలోని గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని వైష్ణవ క్షేత్రాల్లో బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. అనపర్తి పాతఊరులోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయం, కెనాల్‌రోడ్డులో వేంకటేశ్వర స్వామి, పాతవూరులో సత్తి పోతారెడ్డి తేతలి రామారెడ్డి ఆలయం, పొలమూరు గ్రామంలో మదనగోపాల స్వామి తదితర ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



సీతానగరంలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

సీతానగరం: మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలచరించి, ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. సీతానగరం విష్ణాలయంలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామివారికి అభిషేకాలు, సహస్ర నామార్చన, విశేషా పుష్పాలంకరణను ఆలయ అర్చకుడు నాగార్జునశర్మ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించారు. స్థానిక శివాలయంలో ఉమా రామలింగేశ్వర స్వామివారిని, రఘుదేవపురం శివకేశవ ఆలయంలో స్వామివార్లను భక్తులు దర్శించారు. అదే విధంగా రఘుదేవపురంలో కాండ్రు నాగేశ్వరరావు, మంగలక్ష్మి దంపతులు నిర్మించిన శాకంబరి దేవి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ముగ్గళ్లలో ఉమా కొమరేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునికూడలి శివాలయం, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాలు, కాటవరం, బొబ్బిల్లంక, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, తదితర గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిక్కిశాయి.



కోటిలింగాల రేవు వద్ద గుట్టలా చెత్త



పంచిరి మహాదేవుని సత్రం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

రాజానగరం: మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా మరిడి మురళి, నల్లమిల్లి మోహన్ ఎన్నికయ్యారు. బుధవారం స్థానికంగా కొత్త కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

కోశాధికారిగా పలివెల సురేష్, ఉపాధ్యక్షునిగా దారా శివ, సంయుక్త కార్యదర్శిగా కె.సుందర్ విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రమేష్, గౌరవ అధ్యక్షులుగా వి.చిట్టిబాబు, గిరి ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా సాయి, బుజ్జిలతోపాటు కార్యవర్గ సభ్యులుగా అశోక్, రమణ, సత్యరాజ్, రాజేష్, జయకృష్ణ, శివ, రాములను ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు కోనే శ్రీను, గౌరవాధ్యక్షుడు దొండపాటి లాజరు తదితరుల సమక్షంలో ఈ ఎన్నికలు జరిగాయి.

వీధుల్లో ముంచెత్తే

- ఎక్కడ చూసినా అధ్వానమే
- పారిశుధ్య లోపంతో ఇక్కట్లు
- వెంటాడుతున్న వ్యాధుల భయం

సీటీఆర్ఐ: ఏ వీధి చూసినా.. ఏముందీ. అంతా చెత్తే. ఇది నగరాన్ని ముంచెత్తుతోంది.. పారిశుధ్య నిర్వహణ నానాటికీ దిగజారుతోంది.. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ పూర్తిగా కరవైంది. అసలే వర్షాకాలం కావడంతో ప్రజలను వ్యాధుల భయం వెంటాడుతోంది. రాజమహేంద్రవరం నగరం వ్యాపారపరంగా ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రత్యేక గుర్తింపు పొందించి. ఇక్కడ మొత్తం 97,840 గృహాలు ఉన్నాయి. లక్షన్నర మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. అర్బన్ పరిధిలో మొత్తం 50 డివిజన్లు ఉండగా, 36 మురికివాడలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రతి డివిజన్‌లో పారిశుధ్య సమస్య వెంటాడుతోంది. ఆయా ప్రాంతాల్లో మురికి కూపాల కారణంగా ప్రజలు దుర్గంధం భరించలేకపోతున్నారు. **అయినా నగరపాలక సంస్థ అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహస్తున్నారు. నగరంలో సుమారు 630 కిలోమీటర్ల మేర కాలువల వ్యవస్థ ఉంది. ఇందులో పూడికలు ఎక్కడికక్కడే పేరుకు** పోయాయి. దీనివల్ల వర్షం పడితే పలు వీధుల్లో ముంపునీరు తిష్ఠ వేస్తోంది. అంతే కాకుండా కాలువల్లో నీరు రోడ్లపైకి చేరడంతో అందులోంచే వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వదిలేసి.. మూలకు చేర్చేసి

నగరంలో రోజుకు 160 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పనం అవుతోంది. ఇందులో పొడి చెత్త 40 మెట్రిక్ టన్నులు ఉంటుంది. తడి- పొడి చెత్తను వేరే చేసే ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించాలి. తడి చెత్తతో సేంద్రియ ఎరువు, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయాలి. నగరంలో ఎనిమిది చోట్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి నుంచి తయారయ్యే సేంద్రియ ఎరువు తయారు చేసి సంపద సృష్టించాలనేది ఆశయం. **ఆదెక్కడా అమలు జరగడం లేదు. ఇలా క్రమంగా ఈ కేంద్రాలు మూలకు చేరాయి. చెత్త నుంచి సేంద్రియ ఎరువు**లను తయారు చేసేందుకు స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్‌లో రూ.40 లక్షలతో ఏర్పాటైన ప్లాంటునూ పక్కన పెట్టేశారు. ఇక్కడ కూరగాయ వ్యర్థాలు తదితర వాటితో ఒక గంటలోనే సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు ఓ మెషీన్ కూడా ఏర్పాటు చేశారు. ఇదీ అమలు జరగడం లేదు. ఇంటింటా చెత్త సేకరణలోనూ అనేక లోపాలున్నాయి. వాస్తవానికి ఇంటింటా వెళ్లాల్సిన వాహనం కొన్నిచోట్ల వీధుల్లో ఓ చోటుకు పరిమితం అవుతోంది. నివాసితులు అక్కడకు తీసుకెళ్లి చెత్తను వెయాల్సిన పరిస్థితి ఉంటోంది. ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్తలో ఎక్కువ భాగం పేపరుమిల్లు వద్ద యార్డులో డంప్ చేస్తున్నారు.

నో ఫాగింగ్..

చెత్త సమస్య ఇలా ఉంటే ఆయా డివిజన్లలో దోమల నివారణ చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. మొత్తం నగరంలో దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రాలు ఎనిమిది మాత్రమే ఉన్నాయి. మరికొన్ని అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. ఈ ప్రక్రియ కొన్ని డివిజన్లకే పరిమితం అవుతోంది. కనీసం ప్రతి డివిజన్‌లో రెండు రోజులకు ఒక్కసారైనా ఫాగింగ్, మురుగు కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయాల్సి ఉన్నా అది జరగడం లేదు. దోమల నివారణ మందు నిమిత్తం ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు.

రేవు.. కష్టాలు తీరవు

గోదావరి తీరం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. **పుణ్యస్నానాలు ఆచరించ**డానికి వెళ్లే భక్తులకు **రోత పుట్టిస్తోంది. కోటి**లింగాల రేవు పూర్తిగా **చెత్తతో నిండిపోయింది.** ఇక్కడ అత్యధికంగా **కర్మకాండలు ఆచరించ**డానికి దేశం నలు **మూలల నుంచి ప్రజలు** వస్తుంటారు. అంతే **కాకుండా ఇక్కడ వెలిసిన** కోటిలింగేశ్వరస్వామి **ఆలయం ఎంతో ప్రసిద్ధి** చెందింది. రేవులో **పేరుకుపోయిన చెత్తను** తొలగించడంపై అధి**కారులు శ్రద్ధ చూపడం** లేదు. నగరంలో పారిశుధ్య సిబ్బంది సరిపడినంత లేకపోవడమూ చెత్త సమస్యకు ప్రధాన కారణం.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం



కృష్ణానగర్‌లో ప్రమాదకరంగా మారిన మ్యాన్ హోల్

రాజమహేంద్రవరం సిటీ: చిన్న సమస్యనూ పట్టించుకోక కొందరి ప్రాణాల మీదకు వస్తోంది. రాత్రిళ్లు అదే ప్రమాదకరంగా మారింది. రాజమహేంద్రవరంలోని కృష్ణానగర్ జంక్షన్లో ఓ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. కృష్ణానగర్ నుంచి రామచంద్రరావు పేట మీదుగా పేపర్ మిల్ రోడ్డు వైపు వెళ్లే దారి మధ్యలో మ్యాన్‌హోల్ పూర్తిగా దెబ్బతింది. మరమ్మతులు చేపట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో స్థానికులు రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులే మ్యాన్‌హోల్‌పై అడ్డంగా బోర్డును ఏర్పాటు చేసుకున్నారు. మ్యాన్‌హోల్ దెబ్బతినడంతో రోడ్ సగం మాత్రమే తెరిచి ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం నీట మునిగే ఈ ప్రాంతంలో ఇలాంటి పరిస్థితిపై ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.